క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: మండల కేంద్రంలోని ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఆదివారం అందజేశారు. రూ.7,75,000 విలువైన చెక్కులు నియోజకవర్గంలోని ఆళ్లపల్లి, పినపాక, కరకగూడెం, బూర్గంపహాడ్ మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..

దుమ్ముగూడెం: రోడ్డుప్రమాదంలో మృతి చెందిన బండారుగూడెం గ్రామానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి కుంజా దీపక్ కుటుంబానికి అండగా ఉంటామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి బాదిత తల్లిదండ్రులను ఓదార్చారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. బాదిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందజేస్తామని తెలిపారు.

పర్ణశాలకు పెరిగిన భక్తులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలకు భక్తుల రద్దీ పెరిగింది. గత వారం రోజులుగా వర్షాలు పడకపోవడం, నెల రోజులుగా నీటిలో ఉన్న సీతమ్మ వారి నార చీరల ప్రాంతం పూర్తిగా బయటకు రావడంతో భక్తుల రాకతో కలకలాడుతుంది. నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చిరు వ్యాపారులు భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం రంగారెడ్డి జిల్లా మణికొండకు చెందిన దుర్గేష్, రాధాదేవి దంపతులు రూ.50 వేలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, దాతల కుటుంబ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పే డేలు తగ్గించొద్దు

మణుగూరుటౌన్: సింగరేణి ఏరియా అధికారులు పే డేలు తగ్గించి ఆపరేటర్లను ఇబ్బంది పెట్టడం సరికాదని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి పేర్కొన్నారు. మణుగూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పే డేల విషయంలో అధికారుల తీరును నిరసిస్తూ ఆపరేటర్లు పే డేలను బహిష్కరించారని తెలిపారు. ప్రతీ షిఫ్ట్‌లో ఆపరేటర్లకు 70శాతం పే డేలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు బంగారి పవన్‌కుమార్, రామాచారి, ఇబ్రాయిల్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, వినయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేయండి

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు భోగి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ అలుగుకు గండి పడి నాలుగేళ్లు అయినా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు గుగులోతు శ్రీనివాస్‌నాయక్, చిన్నం సురేష్, కొడెం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రీన్ భద్రాద్రికి విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయతీతో కలిసి మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రికి ఆదివారం పట్టణానికి చెందిన బోనాల సూర్యనారాయణ రూ.5 వేలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి కమిటీ అధ్యక్షుడు ఉమా శంకర్, సభ్యులు పామరాజు తిరుమలరావులు సూర్యనారాయణను శాలువాతో సన్మానించారు. సత్యనారాయణ, పద్మరావు, జ్యోతికుమార్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. మోటార్ మెకానిక్ వర్కర్ల కోసం ఆటోనగర్ ఏర్పాటు చేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మాస్‌లైన్ నివాళి

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లి గ్రామానికి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా.. ఆయన భౌతిక కాయానికి, పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాయకులు ప్రభాకర్, దుర్గమ్మ, ముత్యాలరావు, వీరబాబు, శరత్, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిధుల కోసం ఎదురుచూపులు

- 'ఎన్‌క్వాస్'కు ఎంపికైన కరకగూడెం పీహెచ్‌సీ
- ఏడాది గడిచినా విడుదల కాని ప్రోత్సాహకం
- మరుగున పడుతున్న మౌలిక సౌకర్యాల కల్పన



కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



బాత్రూమ్ దుస్థితి ఇలా..

కరకగూడెం: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడంలో కీలకమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) ద్వారా ఎంపిక చేసిన ఆస్పత్రులకు కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇందులో భాగంగా నాణ్యత ప్రమాణాలు, వైద్య సేవలు సరిగా ఉన్న ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఈ నిధులతో ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగు పరుస్తారు. కానీ ఎంపిక చేసిన ఆస్పత్రులకు నిధులు సమకూరకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. కరకగూడెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను గతేడాది ఎంపిక చేయగా నేటికీ నిధులు రాకపోవడంతో మెరుగైన వసతులు అందించలేక పోతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు.

ఎంపిక ఇలా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, అవసరమైన మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం తదితర ఎనిమిది విభాగాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారు. అన్ని సరిగా ఉన్న ఆస్పత్రులను ఎన్‌క్వాస్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన వాటికి మూడేళ్ల పాటు ఏటా నిధులు విడుదల చేస్తారు. ఇందులో ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున, పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏటా రూ.2లక్షలు, పల్లె దవాఖానాలు, ఉప కేంద్రాలకు రూ.1.50 లక్షల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తారు. ఎంపికై న ఆరోగ్య కేంద్రానికి నిధులు సమకూరకపోవడంతో ఇప్పటికే వివిధ పనులకు సొంతంగా వైద్యాధికారి డబ్బులు వ్యయం చేసిన పరిస్థితి నెలకొంది.

నిధులొస్తే ప్రయోజనం..

ప్రస్తుతం నిధుల లేమితో ప్రాథమిక కేంద్రాలు, సబ్ సెంటర్స్,పల్లె దవాఖానాలు వివిధ సమస్యలతో సతమతం అవుతున్నాయి.ముఖ్యంగా ప్రహరీ గోడలు లేకపోవడంతో ఆవరణాల్లో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. అలాగే టాయిలెట్స్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రోగులకు, సిబ్బందికి సమస్యలు తప్పడం లేదు. వీటికి తోడు అనేక సమస్యలు ఉన్నాయి. వీటన్నిటి పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.



ఆస్పత్రిలో పడిపోయిన కంచె

సౌకర్యాలు కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా మూత్రశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం అని తరచూ చెప్తున్న పాలకుల మాటలకు వాస్తవిక పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది.

– సున్నం నాగమణి, మొగిలితోగు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఎన్‌క్వాస్ కింద ఎంపికైన కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిధులు రావాల్సి ఉంది. ఆస్పత్రిలో చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. నిధుల మంజూరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ప్రస్తుతం రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించడమే నా ముందున్న ముఖ్య లక్ష్యం.

– కారం మధు, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ

తీర్పును హర్షిస్తూ ర్యాలీ



భద్రాచలంఅర్బన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తు ఆదివారం భద్రాచలం పట్టణానికి చెందిన వివిధ సంఘాలకు చెందిన నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని మాదిగ అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.నారాయణరావు, భీమపాక పెదరాజు, గద్దల నరసింహారావు, శ్రీనివాసరావు, ఐనంపూడి జపాన్ రావ్, కోట దేవదానం, నహి మియా, ఉదయ్, రావులపల్లి సత్యం, ముద్దా పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమం కావడం పట్ల మాదిగలు పెద్ద ఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌విగ్రహం వద్ద మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు గొడ్ల మోహన్‌రావు, మండల నాయకులు నల్లగట్ల వెంకన్న, గద్దల విజయ్, లక్ష్మీనారాయణ, కోండ్రు నాగరాజు, కుక్కముడి దయాసాగర్, చెంగల నాగరాజు, సీహెచ్ హుసేన్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

బూర్గంపాడు/భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీల్లో మల్టీ పర్పస్ కార్మికుల విధానం రద్దు చేయాలని, కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సారపాక, భద్రాచలంలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానం రద్దుపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం విధులకు హాజరుకాకుండా బంద్ పాటించాలని కోరారు. సారపాక సమావేశంలో నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, సురేష్, చారి, రాము, యాకుబ్, లక్ష్మి, లక్మాబీ, భద్రాచలం సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ.నర్సారెడ్డి, కాపుల రవి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సాయి, చెన్నకేశవులు, ప్రేమ్, వర రాజు, విజయ, అనసూయ ఆదినారాయణ, మనోజ్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఏజే రమేష్

కోనోకార్పస్ చెట్లు తొలగింపు

భద్రాచలంఅర్బన్: మానవాళికి హానీ కలిగించే కోనోకార్పస్ చెట్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగించారు. ఈ మొక్కల స్థానంలో ఇతర మొక్కలు నాటుతామని గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్ రావు అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హరిత సొరంగంలా 'వెదురు'



హరిత సొరంగంలా ఉన్న వెదురు తోట

అశ్వారావుపేటరూరల్: ఓ వెదురు తోట మధ్యలో ఉన్న దారి హరిత సొరంగంలా మారి ఆహ్లాదాన్ని పంచుతోంది. అశ్వారావుపేట మండలం తిమ్మాపురం–వినాయకపురం మధ్యలోని అటవీ ప్రాంతంలో మూడేళ్ల క్రితం ఎఫ్‌డీసీ సంస్థకు చెందిన భూముల్లో వెదురు ప్లాంటేషన్ పెంచుతున్నారు. వందలాది ఎకరాలు ఉండే ఈ వెదురుతోట మధ్యలో దారి వదిలారు. ప్రస్తుతం ఆ మార్గంలో వెదురు కర్రలు ఏపుగా పెరిగి వాలిపోయి, హరిత పందిరిగా మారాయి. దీంతో ఇటు వైపు రాకపోకలు సాగించే వారు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

దాడి ఘటనపై కేసు

ములకలపల్లి: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి దాడికి పాల్పడ్డారని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ములకలపల్లికి చెందిన ముక్కెర పూర్ణచందర్‌రావుకు జీసీసీ పెట్రోల్ బంక్ సమీపాన భూమిలో సాగు పనులు చేస్తుండగా వంటసాల రవికుమార్ మరికొందరితో ట్రాక్టర్ ద్వారా పొలంలోకి ప్రవేశించాడు. భూమిలో తమకూ వాటా ఉందని దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. ఘటనపై పూర్ణచందర్‌రావు ఇచ్చిన ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో ప్రతీ ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్‌కాలనీ, కలివేరు తోగు, దానవాయిపేట శివారు తాలిపేరు ప్రధాన కాలువ ప్రాంతాల్లో మోహరించిన పోలీసు బలగాలు.. వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. తనిఖీలలో సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో గుణపాఠం చెబుతాం

చంద్రుగొండ: ఎస్సీ వర్గీకరణ అంశంలో బీజేపీ, టీడీపీలకు మాలలు తగిన గుణపాఠం చెప్తారని మాలమహానాడు బాధ్యుడు బేతి నాగబాబు హెచ్చరించారు. మాలల అమర వీరులకు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలు పెద్ద ఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుట్టనున్నామని ఆయన తెలిపారు. దాసరి బాబు, రాయి రాజా, బడుగు కృష్ణవేణి, ఇల్లంగి బాల కృష్ణ, బడుగు శంకర్, తంబళ్ల మంగయ్య, తలారి నాగరాజు, రాజు, బాబు పాల్గొన్నారు.

వేతన సవరణ పెన్షన్ ఇవ్వాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేసి పదవీ విరమణ చేసిన కార్మికులకు 11వ వేతన సవరణ పెన్షన్‌ను వెంటనే ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం, సీఎంపీఎఫ్ బోర్డ్ స్పందించి రివైజ్డ్ పెన్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీవీఎంవీ ప్రసాద్, మాచారపు లక్ష్మణరావు, వై రామ్మూర్తి, నందం ఈశ్వరరావు, విల్సన్ రాజు, ప్రభాకర్‌రావు, బిక్షపతి, రాజ్‌కుమార్, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, కె శ్రీను, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను ట్రైకార్ జీఎం కుంజా శంకర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి కుంజా దీపక్ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కుంజా దీపక్ మృతి బాధాకరం అని, ఉపాధ్యాయులు, వర్కర్లు విద్యార్థులను దత్తత తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు పెంచేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ పూనెం వీరభద్రం, పూనెం నాగేశ్వరరావు, కుర్సం లక్ష్మణరావు, పీసోడి లక్ష్మయ్య, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ట్రైకార్ జీఎం శంకర్

సొంతంగా గుంతలు పూడ్చారు..

ములకలపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పడిన భారీ గుంతలను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పూడ్చారు. మండలపరిధిలోని మూకమామిడి గ్రామపంచాయతీ కేంద్రంలోని రోడ్డు వానలకు గతులకులమయంగా మారింది. సంబంధితశాఖ అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో, మాస్‌లైన్ గ్రామకమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. స్వంత ఖర్చులతో ట్రాక్టర్లు ఏర్పాటు చేసి, గ్రావెల్ తోలించారు. భారీ గోతుల్లో మట్టి నింపి, రోడ్డు పనులు చేశారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, పైదా కోటేశ్వరరావు, ముత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

బూర్గంపాడు: స్థానిక తాళ్లగొమ్మూరు రైతువేదికలో ఆదివారం ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఐటీసీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సంయుక్తంగా చేపడుతున్న సామాజిక సేవలను అభినందించారు. ఈ వైద్యశిబిరంలో తాళ్లగొమ్మూరు, కోయగూడెం, సారపాకకు చెందిన 350మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ ప్రణవ్‌శర్మ, జనరల్ మేనేజర్ శ్యామ్‌కిరణ్, అడ్మిన్ మేనేజర్ చెంగలరావు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు డీవీఎమ్ నాయుడు, కార్యదర్శి సాయిరామ్, రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షులు అరవిందన్, కార్యదర్శి చైతన్య, సారపాక గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్, రోటేరియన్లు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే పాయం, ఐటీసీ ఉన్నతాధికారులు

మాజీ జెడ్పీటీసీకి సన్మానం



మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత దంపతులను సన్మానిస్తున్న మోరంపల్లి బంజర నాయకులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామ నాయకులు, ప్రజలు మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీగా ఐదేళ్ల పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. జెడ్పీటీసీగా ఎన్నికైన దగ్గర నుంచి పార్టీలకు అతీతంగా ఆమె సేవలను అందించారన్నారు. కరోనా కష్టకాలంలో, గోదావరి వరదల సమయంలో జెడ్పీటీసీ శ్రీలత దంపతులు తమ సొంతఖర్చులతో ప్రజలకు సేవలు అందించి అండదండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కైపు ఖగేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి,పేరం రామిరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, కైపు నాగిరెడ్డి, మూల లక్ష్మీరెడ్డి, గంటా రమేష్, ఆవుల మహేష్‌రెడ్డి, కామిరెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని హీల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఆర్‌ఓ ప్లాంట్‌ను రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి శనివారం ప్రారంభించారు. రోటరీ జిల్లా గవర్నర్ స్నేహపూర్వక పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రెడ్ల సత్రంలో (రాఘవ నిలయంలో) జరిగిన క్లబ్ సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షుడు దార బాలాజీ, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్ పి. శ్రీ మహాలక్ష్మి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్ పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి

ముత్యాలమ్మకు బోనాలు



మణుగూరుటౌన్: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయిగూడెం గ్రామంలో ఆదివారం మహిళలు ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ బొడ్రాయికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున మహిళలు ఆదివారం ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, పంటలు బాగా పడాలని, పాడిపశువులు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, ఆకుల శ్రీనివాసరావు, గాదె లింగయ్య, లంకా నర్సింహారావు పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రావణమాంస బోనాల సందడి నెలకొంది. పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రసాదాలు చేసి అమ్మవారులకి సమర్పించారు. దేవతామూర్తులకు చీర జాకెట్ టెంకాయ, పసుపు కుంకుమ పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



చంద్రుగొండ: తిప్పనపల్లిలో..



కరకగూడెంలో..